క్రాంతిని ప్రేరేపించే సంక్రాంతి

సంక్రాంతి పర్వం (పండుగ) సృష్టిలో జరిగే ఒక మార్పును సూచిస్తుంది. మనం నివసించే ఈ భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరుగుతూ ఉంటుందనే విషయం మన అందరికి తెలిసినదే. భూమి తన చుట్టూ తాను తిరగటానికి దినం (24 గంటలు) పడుతుంది. సూర్యుని చుట్టూ తిరిగి రావడాఇనికి ఒక సంవత్సరం పడుతుంది. ఈ సూర్యుని చుట్టూ చేసే భ్రమణం సరిగా గుండ్రంగా కాక కోలగా (కోడిగ్రుడ్డు ఆకారంగా) ఉంటుంది. ఇంతేకాక, భూమి 23 1/2 డిగ్రీలు ఏటవాలుగా తిరుగుతూ 6 నెలలు ఉత్తరధ్రువం సూర్యునివైపు వంగుతూ, మరొక 6 నెలలు దక్షిణధ్రువం సూర్యునివైపు వంగుతూ తిరుగుతుంది. అందువల్లనే భూమిపై ఋతువు లేర్పడుతున్నాయనీ, ధ్రువ ప్రాంతాలలో 6 నెలలు పగలు, 6 నెలలు రాత్రీ ఏర్పడుతున్నాయనీ, ఉత్తరాయణ దక్షిణాయనాలు ఏర్పడుతున్నాయనీ వైజ్ఞానికులంటారు.

మన ప్రాచీన ఖగోళవేత్తలు ఖగోళాన్నంతా ఒక వృత్తంగా (వలయంగా) భావించి దానికి కాంతివృత్తమని పేరు పెట్టారు. ఆ కాంతి వృత్తాన్ని 12 భాగాలుగా చేసి వాటిని రాశులన్నారు. ఒక్కొక్క రాశి భాగంలో లక్షలకొలది నక్షత్రాలుంటాయి – నక్షత్రరాశులన్నమాట. అందులో ప్రకాశించేవి మన కంటికి కనబడతాయి. ఆ ప్రకాశ నక్షత్రాలు ఒక ఆకారాన్ని కల్పిస్తాయి. ఆయా ఆకారాలనుబట్టి ఆయా రాశులకు మేషం, వృషభం, మిథునం, కర్కాటకం, సింహ, కన్య, తుల, వృశ్చికం, ధనుస్సు, మకరం, కుంభం, మీనం అనే 12 పేర్లు పెట్టారు. మనం సంక్రాంతి పండుగగా వ్యవహరించే రోజున సూర్యుడు ధనుస్సు రాశిని విడిచి మకరరాశిలో ప్రవేశించి ఒక నెలరోజులు ఆ రాశిలో ఉంటాడు. ఇంతేకాక, ఈ దినం నుండే భూమి ఉత్తరధ్రువాన్ని సూర్యునివైపు వంచటం ప్రారంభిస్తుంది. భూమిపైనున్న మనకు ఉత్తరాయనకాలం ప్రారంభమౌతుంది. సూర్యోదయం దక్షిణదిశ నుండి ఉత్తరదిశకు జరుగుతూ ఉన్నట్లు కనబడుతుంది. పగటి పరిమాణం క్రమంగా

పెరుగుతుంది. వాత శ్లేష్మ తత్వాల వారి బాధలు క్రమంగా ఉపశమిస్తాయి. అందుకనే ప్రజలు ఉత్తరాయణాన్ని పుణ్యకాలంగా భావిస్తారు. యథార్థంగా ఈ ఉత్తరాయణం (మకర సంక్రమణం) డిసెంబరు 22వ తేదీనాడే ప్రారంభమౌతుంది. కాని, ఎందుచేతనో ఫలిత జ్యోతిష్కులు జనవరి 14వ తేదీని మకర సంక్రమనం అంటున్నారు!

సంక్రాంతి పర్వం ప్రాకృతికంగా భూభ్రమణంలోని ఒక మార్పును సూచించే పండుగే అయినా అది మనకెంతో చక్కటి క్రాంతి సందేశాన్నిస్తున్నది. 'క్రము - పాదవిక్షేపే' అనే సంస్కృత మూల ధాతువుతో 'క్రాంతి' పదము ఏర్పడుతుంది. కనుక, క్రాంతి అంటే అడుగు ముందుకి పయనించటం - పురోగమించటం. దానికి 'సం' ఉపసర్గ చేర్చి 'సంక్రాంతి' అన్నారు. 'చక్కటి పురోగమన' మని దీని అర్థం.

"పురోగమన మంటే ఏమిటి?" ఇది ఆలోచించవలసిన విషయం. కొందరు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగటమే పురోగమన మంటారు. కొందరు శాస్త్ర సాంకేతిక రంగాలలో ఉన్నతి చెందటమే పురోగమన మంటారు. మరికొందరు నాగరికులమై సమసమాజాన్ని నిర్మించటమే పురోగమన మంటారు. ఇవన్నీ ఆంశికంగా పురోగమనాలే. కాని, సమగ్ర పురోగమన మేది? దీనికి సృష్టికర్త యిచ్చిన వేదజ్ఞాన మేమంటుందో చూద్దామా!

తంతుం తన్వన్ రజసో భానుమన్విహి
జ్యోతిష్మతః పథో రక్ష ధియా కృతాన్ ।
అనుల్బణం వయత జోగువామపో
మనుర్భవ జనయా దైవ్యం జనమ్ ॥ - ఋగ్వేదం 10-53-6

ఓ కర్మయోనిని బొందిన మానవా! ఆకాశలో గ్రహ ఉపగ్రహాలతో గూడి పయనించు సూర్యుని నీవు అనుకరించు. 'కర్మ'లనే దారాలతో 'జీవిత'మనే వస్త్రాన్ని నిర్మించుకో. అది నీ చేతిలో ఉంది. 'వైదిక సంస్కృతీ సభ్యత' లనే ఋషి నిర్మిత వెలుగు బాటలను సదా రక్షించు. అనుసరించు. నిరంతరం సత్కర్మానుష్ఠాన పరుడవు కమ్ము. మనన శీల మానవుడవై దివ్యమానవ సమాజాన్ని నిర్మించు.

'తంతుం తన్వన్ రజసో భానుమ్ అన్విహి'

దారాలతో వస్త్రాలను నేయు ఓ మానవుడా! గ్రహాలతో కూడి పయనించు సూర్యుని అనుసరించు.

ఈ మాట చాలామందికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. కాని, ఇది సత్యం. నేత పనివారు పడుగుపేకలతో – పొడుగు మరియు అడ్డ దారాలతో వస్త్రాలను నేయునట్లే మానవులు 'మంచికర్మలు మరియు చెడు కర్మలు' అనే దారాలతో జీవితమనే వస్త్రాన్ని సదా నేస్తూనే ఉంటారు. మన ఇప్పటి ఈ జీవితానికి పూర్వం మనం చేసిన కొన్ని మంచి చెడు కర్మల సమిష్టి రూపమే కారణం. ఎవరు పూర్వం సత్కర్మలు ఎక్కువగా చేసి ఉంటారో వారి జీవితం అంత సుఖమయంగా సాగిపోతుంది. ఎవరి పూర్వకర్మలు మంచివికావో వారి జీవితం కష్టాలతో సాగుతూ ఉంటుంది. అవి ఈ జన్మలో చేసిన కర్మలే కానక్కరలేదు. పూర్వ జన్మలలోనివి కావచ్చు. పుణ్యకర్మలను తెల్లదారాలతోను, పాపకర్మలను నల్లదారాలతోను పోల్చవచ్చు. తెల్లదారాల సంఖ్య ఎంత ఎక్కువగా ఉంటే అంతగా ఆ వస్త్రం తెల్లగా ప్రకాశిస్తూ ఉంటుంది. నల్లదారాల సంఖ్య ఎక్కువైతే నల్లగా వికారంగా వస్త్రం తయారౌతుంది. జీవితం కూడా అంతే.

అందుచే పరమేశ్వరుని ఉపదేశమేమంటే – **'రజసో భానుమ్ అన్విహి'** ఆకాశంలో గ్రహాలతో కూడి – వాటిని తన ఆకర్షణ శక్తితో పట్టుకొని పయనించు సూర్యుని అనుసరించు. సూర్యుడు ఏ గ్రహాన్నీ తనలోనికి ఆకర్షించి మండించి మసి చెయ్యడు. వాటిని పట్టుకొని తానును మిల్కీవే గెలాక్సీ కేంద్రాన్ని చుట్టి వస్తున్నాడు. అలాగే మనం కూడా మానవ సమాజంలో ఎవరికీ నష్టం చేయకుండా మన లక్ష్యం వైపు పయనించాలి. ఇంతేగాక, తోటివారు కూడా ఉన్నతి పొంద సహకరించాలి.

'జ్యోతిష్మతః పథో రక్ష ధియా కృతాన్'

పూర్వపు మేధావులు నిర్మించిన వెలుగుబాటలను నీవు రక్షిస్తూ ఉండు.

మనకన్న పూర్వులైన మేధావులు – అంటే ఋషులు, మునులు, మహాత్ములు. వారు మానవోన్నతికి కొన్ని చక్కటి మార్గాలను నిర్మించారు. షోడశ సంస్కారాలు, చతురాశ్రమాలు, వర్ణాశ్రమ ధర్మాలు, పంచమహా యజ్ఞాలు మొదలైనవే ఆ వెలుగు బాటలు. వాటిని మనం చెడగొట్టక వీలైనంతగా వాటిని రక్షించాలి. అంటే –

మనం వాటిని అనుసరిస్తూ ఇతరులకు ఆదర్శంగా ఉండాలి. (వీటిని గురించి రాబోవు పండుగలలో వివరంగా తెలుసుకొందాము).

'అనుల్బణం వయత జోగ్‌వామ్ అపః' ఎప్పుడూ - ఎడతెగకుండా సత్కర్మలనే చేస్తూ ఉండు. పరమేశ్వరుని మరొక ఉపదేశమేమంటే - నీ భావి జీవితానికి, ఉన్నతికి సత్కర్మలే కారణమని గుర్తించి సదా సత్కర్మలనే చేస్తూ ఉండు. ఆ పనిలో విరామం వద్దు.

'కుర్వన్నేవేహ కర్మాణి జిజీవిషేత్ శతం సమాః' "సత్కర్మలు చేస్తూనే నూరేండ్లు జీవించగోరు. సత్కర్మల ఫలాన్ని పరమేశ్వరున కర్పించి కర్మ బంధనాన్నుండి విముక్తిని పొందు. అప్పుడే నీవు పరమానందరూప ముక్తిని పొందగలవు" అంటుంది యజుర్వేదం 40-2.

'మనుర్భవ, జనయా దైవ్యం జనమ్' మననశీల మానవుడవై దివ్యమానవ సమాజాన్ని నిర్మించు. ఇదే ఈ మంత్రంలో సృష్టికర్త యిచ్చు చివరి సందేశం. మనమంతా ఆకారంలో మానవులుగా ఉన్నామే కాని మనలో మానవత్వ మెంత ఉందో ఎప్పుడైనా ఆత్మ విమర్శ చేసుకొన్నామా? మానవత్వానికి మహర్షి మనువు చెప్పిన దశ లక్షణాలు మనలో ఎంతెంత శాతంలో ఉన్నాయి? అవి ఏవంటే -

శ్లో॥ ధృతిః క్షమా దమోఽస్తేయం శౌచ మింద్రియ నిగ్రహః ।
ధీ ర్విద్యా సత్య మక్రోధో దశకం ధర్మలక్షణమ్ ॥

- మనుస్మృతి 6-92

ధృతిః - ధైర్యాన్ని కలిగి ఉండటం, క్షమా - సహనశీలత, దమః - మనోనిగ్రహం, అస్తేయం - దొంగతనం చెయ్యకుండా ఉండటం, శౌచం - బాహ్యాభ్యంతరాలు శుద్ధంగా ఉంచుకోవటం, ఇంద్రియ నిగ్రహం - ఇంద్రియాలను తన వశంలో పెట్టుకోవటం, ధీః - బుద్ధితో ఆలోచించి పనులు చేయటం, విద్యా - తన స్వరూపాన్నీ, ప్రపంచ స్వరూపాన్ని చక్కగా తెలుసుకోవటం, సత్యమ్ - సత్యమునే పలకటం, ఆచరించటం. అక్రోధః - కోపము, పగ, కక్ష లేకుండటం. ఈ పది లక్షణాలు కలిగి ఉండటమే మానవ ధర్మం. (వీటిని గురించి వివరంగా తెలుసుకోగోరువారు నా రచన మానవధర్మం" చదువగోరుచున్నాను).

'జనయా దైవ్యం జనమ్' నీ వొక్కడవే పై పది గుణాలను పెంచుకుంటూ

ఉన్నతి చెందటం కూడా పూర్తిగా మంచిది కాదు. నీ జ్ఞానాన్ని ఇతరులకు పంచి వారి ఉన్నతికి కూడా కృషి చెయ్యమని సృష్టికర్త సందేశం. కనుకనే మహర్షి దయానందుల వారు – **"ప్రతి వ్యక్తియు తన ఉన్నతితోనే సంతృప్తి చెందక అందరి ఉన్నతిలోనే తన ఉన్నతి కలదని నమ్మవలెను. (భావించవలెను)"** అన్నారు. వారు స్థాపించిన ఆర్య సమాజానికి దశ నియమాలు ఏర్పరచి, వాటిలో దీనిని 9వ నియమంగా నిర్దేశించారు.

ఈ వేద మంత్రంలోని 'భానుమన్విహి – సూర్యుని అనుసరించు' అనే మాటలోని అంతరార్థం ఇదే. చక్కటి క్రాంతి మార్గంలో పయనించమనటమే సృష్టికర్త యిచ్చే సంక్రాంతి సందేశం. క్రాంతితోనే శాంతి లభిస్తుంది. ఆనందం లభిస్తుంది.

క్రాంతిరస్తు – శాంతిరస్తు – ఆనంద ప్రాప్తిరస్తు

(సౌర) – మకర సంక్రాంతి

మకర సంక్రాంతి పండుగ చలికాలమునకు – శిశిర ఋతువునకు సంబంధించిన పండుగ. ఈ పండుగ దినములలో చలి ఎక్కువగా నుండును. జనవరి 14, 16 తేదీలలో నేదో యొక దినమున నీపండుగ జరుపబడుచుండును. తిలలు–నువ్వులతో చేయబడిన లడ్డూలీ దినమున భుజింతురు.

విశేషాహుతుల మంత్రములు

ఓం సహశ్చ సహస్యశ్చ హైమంతికావృతూ । అగ్నే రంతః శ్లేషోఽసి
స్వాహా । కల్పేతామ్, ద్యావాపృథివీ స్వాహా ।
కల్పన్తామాప ఓషధయః స్వాహా ।
కల్పన్తామ్, అగ్నయః పృథఙ్మమ జ్యైష్ఠ్యాయ సవ్రతాః స్వాహా ।
యే అగ్నయః సమనసోఽన్త రా ద్యావాపృథివీ ఇమే
హైమన్తికావృతూ అభికల్పమానా ఇంద్రమివదేవా
అభిసంవిశన్తు, తయా దేవతయాఙ్గిరస్వద్
ధ్రువే సీదతమ్ ॥స్వాహా॥ (యజు. 14–27)

ఓం తపశ్చ తపస్యశ్చ శైశిరావృతూ,
అగ్నేరంతః శ్లేషోఽసి స్వాహా ।
కల్పేతామ్, ద్యావాపృథివీ స్వాహా ।

కల్పన్తామాప ఓషధయః స్వాహా ।
కల్పన్తామ్ అగ్నయః పృథఙ్మమ జ్యైష్ఠ్యాయ సవ్రతాః స్వాహా ।
యే అగ్నయః సమనసోఽన్తరా ద్యావాపృథివీ ఇమే ।
శైశిరావృతూ అభికల్పమానా ఇంద్రమివదేవా అభిసంవిశన్తు,
తయా దేవతయాఙ్గి రస్వద్ ధ్రువే సీదతమ్ ॥స్వాహా॥ (యజు. 15-57)